

జిల్లాతో అనుబంధాన్ని మరవలేను

ప్రకాశం జిల్లాతో పెనవేసుకున్న అనుబంధాన్ని మరువలేనని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. బదిలీపై తిరుపతి వెళ్తున్న ఆమెకు వీడ్కోలు పరేడ్ నిర్వహించారు. - 8లో..



గిద్దలూరు గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా

గిద్దలూరు గడ్డ వైఎస్సార్ సీపీకి అడ్డా అని, వచ్చే ఎన్నికల్లో నాగార్జునరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విశ్వసనీయతకు పట్టం



మార్కాపురం: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) చైర్మన్‌గా మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డిని నియమిస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎస్.యువరాజ్ జీఓ నంబర్ 26ను విడుదల చేశారు. జంకె వెంకటరెడ్డి 1994 నుంచి 99 వరకు ఎమ్మెల్యేగా, 2014–19 వరకు రెండో దఫా మార్కాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. తరువాత ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోయినా పార్టీపట్ల అంకితభావంతో పనిచేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా పార్టీ అభివృద్ధి కోసం, అభ్యర్థుల గెలుపు కోసం ఆయన పర్యటిస్తూ కృషి చేస్తున్నారు. విశ్వసనీయతకు, నిజాయతీకి మారు పేరుగా జంకె వెంకటరెడ్డిని అభిమానులు భావిస్తుంటారు. నమ్ముకున్న వారిని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదరిస్తారనే దానికి ఈ పదవే నిదర్శనమని పార్టీ అభిమానులు, కార్యకర్తలు అంటున్నారు. ఆయన రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో ఉంటారు. కీలకమైన రాష్ట్ర స్థాయి పదవి జంకెను వరించటం పట్ల పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

16న మహా సూర్య వందనం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 16వ తేదీ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో ప్రణవ సంకల్ప యోగ సమితి సహకారంతో 'మహా సూర్య వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్పందన హాలులో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 3 వేల మంది విద్యార్థులతో 108 సార్లు సూర్య నమస్కారాల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించేలా కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని తెలిపారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు, డిప్యూటీ డీఈఓ అనిత రోజ్‌రాణి, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

విజయం కోసం ఐక్యంగా పనిచేద్దాం

- మంత్రి మేరుగు నాగార్జున



నాగులుప్పలపాడు మండల నాయకులతో చర్చిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: మండల అగ్రశ్రేణి నాయకత్వం సమష్టిగా పనిచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను తిరిగి నాగులుప్పలపాడు మండలంలో ఎగురవేయడానికి అందరం ఐక్యంగా పనిచేయాలని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సోమవారం ఒంగోలులోని మంత్రి కార్యాలయంలో నాగులుప్పలపాడు మండల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి మేరుగు నాగార్జున నాయకులతో అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నాయకులందరూ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి, మేరుగు నాగార్జునను గెలిపించడానికి తామంతా ఐక్యంగా కలిసి పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మార్నెళ్ల బంగారు బాబు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పులిచర్ల పరంధామిరెడ్డి, పల్లెర్ల అంజిరెడ్డి, మద్దిసాని నాగేశ్వరరావు, పోలినేని కోటేశ్వరరావు, త్రినాథ్ రెడ్డి, కాట్రగడ్డ శ్రీను, కోయి హనుమయ్య ఉన్నారు.

పేదల పట్టాలపై పచ్చ కూట విషం

పేదల పట్టాలపై పచ్చ దండు విషాన్ని చిమ్ముతోంది. ఎలాగైనా పట్టాలు దక్కకూడదంటూ అటు పచ్చ పార్టీ వారి అనుకూల ఎల్లో మీడియా కుట్రలు పన్నుతూనే ఉంది. ఒంగోలు నగరంలో 25 వేల మందికి పట్టాలు ఇస్తే తమకు భవిష్యత్ ఉండదన్న భయంతో టీడీపీ నేతలు న్యాయపరమైన అడ్డంకులు సృష్టిస్తే వారి అనుకూల మీడియా అసత్య కథనాలను వండివారుస్తోంది. రోజుకో రకమైన కథనాలు రాస్తూ గందరగోళాన్ని సృష్టిస్తోంది. నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదలపై ఎన్ని దాడులు జరిగినా పల్లెత్తు మాట అనని పచ్చ మీడియా నేడు పేదలకు మంచి జరుగుతుంటే ఓర్వలేక రాస్తున్న కథనాలపై ప్రజలు మండిపడుతున్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే విషయంలో అడ్డుతగిలితే తగిన శాస్తి చేయాల్సి వస్తుందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.

- పంపిణీ అడ్డుకోవడమే లక్ష్యంగా కుయుక్తులు
- నాడు పట్టాలు ఇవ్వలేరంటూ అసత్య కథనాలు
- నేడు ఇస్తుంటే.. అవి ప్రజలకు దక్కకుండా చేయాలనే కుట్రలు
- టీడీపీకి వంతపాడుతున్న ఎల్లో మీడియా
- పచ్చ దండుపై మండిపడుతున్న జనం



వెంగముక్కలపాలెం వద్ద పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చే స్థలం

ఒంగోలు: ఒంగోలు నగర శివారు కొణిజేడు కొండపై ఆది నుంచి తెలుగుదేశం పార్టీది దొంగాటే. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కొణిజేడు కొండల్లో ఇనుప ఖనిజం తవ్వకాలకు జింపెక్స్ కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారు. ఈ ప్రాంతంలో ఖనిజం తవ్వకాలు మొదలుపెడితే తాము నివాసం ఉండలేని పరిస్థితులు ఉంటాయంటూ టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు. ఖనిజం తవ్వకాలు నిలిపేయాలంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. చివరకు ఆ ప్రాజెక్టు మూలనపడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని చేపట్టింది. ఒంగోలు నగరంలో పేదలందరికీ ఒకే చోట ఇళ్లు నిర్మించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి యోచించారు. 25 వేల మందికి ఒకే చోట పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి శాటిలైట్ సిటీని నిర్మించాలని ఆయన తలంచారు. స్థలాన్ని చదును చేయించారు. ప్లాట్లుగా విభజించారు. ఇక పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. అంతమందికి ఒకే చోట ఇళ్లు ఇస్తే తమకు భవిష్యత్ ఉండదని భయపడిన తెలుగుదేశం నేతలు కుట్రలకు తెరతీశారు. పేదల ఇళ్ల కోసం ఎంపిక చేసిన స్థలం ఇనుప ఖనిజం కోసం నిర్దేశించిందంటూ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అనుచరులతో కోర్టులో కేసులు వేయించి అడ్డుతగిలారు. నాడు ఇనుప ఖనిజం తవ్వకాలు వద్దని, నేడు ఇళ్ల పట్టాలు ఇవ్వరాదంటూ రెండు రకాలుగా వారే కోర్టుకెక్కడం వారి కుయుక్తులకు నిదర్శనంగా నిలుస్తోంది. నాడు వారి కుట్రల ఫలితంగా పేదలు ఇళ్లకు దూరమయ్యారు.

సవాల్‌గా తీసుకున్న బాలినేని

నగరంలో పేదలకు ఎలాగైనా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బాలినేని నిర్ణయించుకున్నారు. పచ్చ కుట్రలకు చెక్ పెట్టేలా అడుగులు వేశారు. ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసైనా 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలన్న తన ఆలోచనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుంచారు. ఆయన సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నర్సాపురం అగ్రహారం-మల్లేశ్వరపురం, వెంగముక్కలపాలెం-యరజర్ల మధ్య పొలాలను రైతుల వద్ద నుంచి ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. దీనికి రూ.210 కోట్లు వ్యయం అవుతుందని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. నిధుల విడుదల కోసం బాలినేని ప్రభుత్వ పెద్దలను కలుస్తూనే ఉన్నారు. కొంత జాప్యం కావడంతో పచ్చదండు మళ్లీ కుట్రలకు తెరతీశారు. తెలుగుదేశం నేతలకు వంతపాడుతూ డబ్బులు రావంటూ రైతులు ఆందోళన చెందేలా ఎల్లో మీడియా అసత్య కథనాలను సృష్టించింది. రోజుకో రకంగా జిల్లా పేజీల్లో కథనాలు రాస్తూ వచ్చింది. బాలినేని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నేరుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకుని పరిస్థితిని వివరించారు. ఆయన వెంటనే రూ.210 కోట్లు విడుదలజేశారు. వెంటనే బాలినేని జిల్లా అధికారులతో సమావేశమై స్థలాలిచ్చిన రైతుల అకౌంట్లలో జమ చేయించారు. అలాగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేగంగా పనులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతూ ఉంటే మరో వైపు ఎన్నికల కోడ్ వచ్చేస్తోంది పట్టాలు ఇవ్వరంటూ పుంఖాను పుంఖాలు వార్తలు ఇచ్చాయి. 'పట్టా కాగితాలు ఇస్తారు కానీ...స్థలం చూపించరంటూ' టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం పొలాలను చదును చేసి హద్దురాళ్లు కూడా వేస్తుండడంతో రకరకాలుగా వాటిని నిలుపుదల చేయించాలని యత్నిస్తున్నారు. చివరకు ఏ స్థాయికి దిగజారాయంటే ప్రజాప్రతినిధి కమీషన్లు అడుగుతున్నాడని, దీంతో రైతులు అందుకు వెనుకాడుతున్నారంటూ కూడా తప్పుడు కథనాలు సృష్టించారు.

భగ్గుమన్న బాలినేని

టిడ్కో ఇళ్లకు భూమి సేకరించినప్పుడు కమీషన్లు కొట్టేస్తే మౌనంగా ఉండి, నేడు రైతుల అకౌంట్లో నేరుగా డబ్బులు జమవుతుంటే కమీషన్లు అంటూ రాయడం ఏపాటి జర్నలిజం అని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. అవాస్తవాలు వండించి పేదలకు అన్యాయం చేయాలని చూస్తే పత్రికా కార్యాలయాలను కూడా పేద లబ్ధిదారులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. పేదలకు ఇళ్లస్థలాల కోసం తన రాజకీయ జీవితాన్ని కూడా పణంగా పెట్టానన్నారు.

నాడు పేదలపై దాడులు జరిగినా కిమ్మనని ఎల్లో మీడియా..

- గత ప్రభుత్వ హయాంలో ఏకంగా పాత జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం స్థలం తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి కావాలనుకున్నారు. ఈ మేరకు అప్పటి కలెక్టర్‌ను కలిసి అర్జీ సమర్పించారు. అయితే దీనిపై ఆ రెండు పత్రికల స్పందన ఏమిటో అందరికీ తెలిసిందే.
- రంజాన్ పండుగ సమయంలో స్థానిక బండ్లమిట్ట నుంచి ఎన్‌టీఆర్ బొమ్మ వరకు ఊరచెరువుకు ఆనుకుని దశాబ్దాలుగా చిరు దుకాణాలు నిర్మించుకుని జీవనోపాధి పొందుతున్న వారి దుకాణాలను ఎలా ధ్వంసం చేశారో నగరవాసులకు గుర్తుంది. బావురుమంటున్నా లెక్క చేయకుండా పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని దారుణంగా తొలగించిన వ్యవహారం నేటికీ అక్కడ వారిలో భగ్గుమంటూనే ఉంది.
- స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలో సాగర్ ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయాన్ని ప్రపంచ బ్యాంకు నిధులతో ఆధునికీకరణ చర్యలు చేపట్టి బేస్‌మెంట్ లెవల్ వేసిన తరువాత ఆ స్థలం టీడీపీ కార్యాలయానికి కావాలంటూ రచ్చరచ్చ చేశారు. తమ ప్రతిపాదనకు ఆమోదం తెలపని అధికారిని పట్టుబట్టి బదిలీ చేయించారు. కానీ ఫలితం మాత్రం నిరుపయోగమే. ఆ భూమి ఇవ్వడం సాధ్యపడదని స్పష్టమైంది. దీంతో వారు వెనక్కు తగ్గినా వారి పాపానికి నిదర్శనంగా ఆ బేస్‌మెంట్ లెవల్ మాత్రం సాక్ష్యంగా కనిపిస్తూనే ఉంది.
- ఇక ఊరచెరువు రోడ్డుకు ఉత్తరం వైపున సంచార జాతులవారు నివాసం ఉండేవారు. వారు అక్కడ ఉండడం కంటగింపుగా భావించి బలవంతంగా ఆక్రమణల పేరుతో వాటిని కూల్చివేశారు. ఇవన్నీ మచ్చుకు ఉదాహరణలు మాత్రమే

స్వచ్ఛందంగా భూమిని ఇచ్చాం



నాకు సర్వే నంబర్ 9/2బిలో 2.43 ఎకరాలు, 35/1లో 98 సెంట్ల భూమి ఉంది. నా పొలాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంతో స్వచ్ఛందంగా అంగీకరించాం. మా భూమిని ఇస్తున్న ప్రాంతం ఒకప్పుడు మల్లేశ్వరపురం, కానీ నేడు రెవెన్యూ రికార్డుల్లో తప్ప ఆ గ్రామం లేదు. కనుమరుగైన ఆ గ్రామం స్థానంలో నేటి ప్రభుత్వం ఏకంగా ఒక సిటీనే నిర్మిస్తోంది. ఇందుకు మేమంతా ఎంతో సంతోషిస్తున్నాం.

– దేవరపల్లి అంజిరెడ్డి, ఎస్.అగ్రహారం రైతు

కమీషన్లు అంతా మీడియా సృష్టే



మా పొలాల్లో ఇంటిపట్టాల కోసం భూమి కావాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి ఎకరాకు రూ.35 లక్షల చొప్పున ధర నిర్ణయించింది. మేము అంగీకరించాం. ఆ మేరకు ఒప్పందం కూడా చేసుకున్నాం. నాకు ఎల్‌పీ నంబర్‌లో 97.64 సెంట్ల భూమి ఉంది. దీనికి నాకు డబ్బులు కూడా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. మాకు పడే డబ్బుల్లో కమీషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లుగా తప్పుడు కథనాలు సృష్టించడం బాధాకరం. పేదల పక్షాన ఉండాల్సిన పత్రికలు చివరకు పెత్తందారుల వైపు వత్తాసు పలకడం దారుణం.

– మల్లవరపు వెంకటేశ్వరరెడ్డి, ఎస్.అగ్రహారం రైతు

సీఎం చేతుల మీదుగా ఇళ్ల స్థల పట్టాల పంపిణీ

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



వెంగముక్కలపాలెం లే అవుట్ స్థలం వద్ద రైతులు, అధికారులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక వెంగముక్కలపాలెం సమీపంలో జగనన్న కాలనీ కోసం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన స్థలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ రైతుల అంగీకారంతోనే స్థలాలు సేకరించినట్లు తెలిపారు. ఎవరినీ ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని స్పష్టం చేశారు. రైతులెవరూ ఎలాంటి అభ్యంతరాలు పెట్టలేదని, ఇక్కడ ఎలాంటి వివాదం కూడా లేదని వివరించారు. ప్రస్తుతం 191 ఎకరాలు సేకరించామని, 8547 ప్లాట్లకు గాను పట్టాలు పంపిణీ చేయడానికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇంకా మూడు వేల మందికి స్థలం అవసరం ఉందని, అవసరమైన ఆ స్థలాన్ని కూడా సేకరిస్తున్నామన్నారు. మొత్తం మీద 200 ఎకరాలకు పైగా స్థలాన్ని సేకరించినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 25 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అగ్రహారం, వెంగముక్కలపాలెం వద్ద సేకరించిన స్థలాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా ఇక్కడ రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీలోపు ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కానుందని, అయితే సీఎం కార్యక్రమం అగ్రహారంలో పెట్టాలా లేక వెంగముక్కలపాలెంలో పెట్టాలా అనేది ఇంకా నిర్ణయం జరగలేదన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి పర్యటన వివరాలు తెలియజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, ఎం.అంజిరెడ్డి, ఐ.వెంకటేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఈ.తిరుపతి రెడ్డి, సచివాలయం కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, డి.ఉదయ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడను

- మహిళల రక్షణకు ప్రాధాన్యం
- పక్కా ప్రణాళికతో ఎన్నికల నిర్వహణ
- మెరుగైన పోలీసింగ్‌కు చర్యలు
- రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- నూతన ఎస్పీగా పరమేశ్వరరెడ్డి బాధ్యతల స్వీకరణ



ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి

ఒంగోలు సబర్బన్: శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడబోనని జిల్లా నూతన ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. అందరి సహకారంతో జిల్లాను నేర రహితంగా నిలిపేందుకు, పోలీసులు సేవాభావంతో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లా నూతన ఎస్పీగా పి.పరమేశ్వరరెడ్డి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి నుంచి వచ్చిన ఎస్పీ.. తొలుత జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే నాగేశ్వరరావుతో పాటు ఇతర అడిషనల్ ఎస్పీలు, జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) సిబ్బంది నూతన ఎస్పీ పరమేశ్వరరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయంత్రం 6.35 గంటలకు ఆయన బాధ్యతలు చేపట్టారు. నూతన ప్రకాశం జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాకు రెండో ఎస్పీగా పరమేశ్వర రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన ప్రణాళికతో, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మహిళల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని క్రైమ్ తీరుపై లోతుగా చర్చించి మెరుగైన పోలీసింగ్ అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. జిల్లాపై పూర్తి స్థాయిలో అవగాహన సాధించి అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తానని వివరించారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో ముందుంటానని, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఎస్పీకి ఘనస్వాగతం...

నూతన ప్రకాశం జిల్లా తొలి ఎస్పీగా మలికాగర్గ్ పనిచేశారు. ఆమె 2 సంవత్సరాల 7 నెలల పాటు విధులు నిర్వర్తించారు. అదేవిధంగా తిరుపతి నూతన జిల్లా తొలి ఎస్పీగా పి.పరమేశ్వరరెడ్డి 2022 మే 14వ తేదీ బాధ్యతలు చేపట్టారు. మలికాగర్గ్‌ను తిరుపతి ఎస్పీగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి బదిలీ చేస్తూ ఉత్తర్వులిస్తూనే.. అక్కడ ఎస్పీగా పనిచేస్తున్న పి.పరమేశ్వరరెడ్డిని జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు ఈ నెల 1వ తేదీ జీఓ ఆర్డ్ నంబర్–239 విడుదల చేశారు. 2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పి.పరమేశ్వరరెడ్డి రెండేళ్ల పాటు సీఎం వైఎస్ జగన్‌కు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ)గా పనిచేశారు. 2022 మే 14వ తేదీ సీఎస్ఓ నుంచి తిరుపతి ఎస్పీగా బదిలీపై వెళ్లారు. అక్కడ మంచి ప్రశంసలు పొందారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వరరెడ్డికి జిల్లాలోని పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వారిలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకేయూ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 88 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న నాలుగు సంవత్సరాల హానర్స్ డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బాలికలు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. తమ యూనివర్శిటీ నూతనంగా ఏర్పాటైనప్పటికీ నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటనను సకాలంలో నిర్వహించగలిగామన్నారు. మొత్తం 8124 మంది విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు పేర్లు నమోదు చేసుకున్నారని, వారిలో 7201 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. 3309 మంది విద్యార్థులు (46 శాతం) ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

అవినీతి రహితంగా పాలన

- మంత్రి ఆదిమూలపు సురేష్



నర్సింగోలు లో మాట్లాడుతున్న మంత్రి సురేష్

జరుగుమల్లి: జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ వివిధ సంక్షేమ పథకాల ద్వారా అవినీతి రహితంగా నేరుగా నగదు బదిలీ చేస్తూ పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. రూ.1.25 కోట్లతో పలు ప్రభుత్వ కార్యాలయాలు నర్సింగోలులో నిర్మించినట్లు చెప్పారు. నర్సింగోలులో రూ.44 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ఆయన సోమవారం ప్రారంభించారు. మొదట మాజీ జెడ్పీటీసీ పాటిబండ్ల జయప్రసాదరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని శ్రీ గంగా పార్వతీసమేత రామలింగేశ్వరాలయంలో మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు చేశారు. భవనాలను ప్రారంభించిన అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందరికీ చేరువ చేశారన్నారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. సీఎం జగన్ అంబేడ్కర్ స్ఫూర్తితో పాలన సాగిస్తూ ఆ మహనీయుని 206 అడుగుల భారీ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను అందరూ ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగనన్న సైనికుడిగా మీ దగ్గరకు వచ్చానని.. ఒక్క అవకాశం ఇస్తే మీ సేవకుడిగా ఉంటానన్నారు. నర్సింగోలులోని డిజిటల్ లైబ్రరీకి రూ.లక్ష విలువైన పుస్తకాలు అందజేస్తామని మంత్రి సురేష్ తెలిపారు. రామచంద్రాపురం, నర్సింగోలులో సీసీ రోడ్లు నిర్మించుకున్నామన్నారు. ఎస్టీ కుటుంబాల మహిళలు ఇళ్లపట్టాలు కోరారని వాటిని కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం నిర్మల సత్యన్నారాయణ, ఎంపీటీసీ పాటిబండ్ల భవాని, సర్పంచ్ ఏజెర్ల ఇక్కయ్య, జరుగుమల్లి మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, వైస్ ఎంపీపీ పులి బిక్షాలు, మాజీ కన్వీనర్ పాటిబండ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాటిబండ్ల వేణుగోపాల్, కుంచాల బ్రహ్మయ్య, చెన్నారెడ్డి మధు, చెన్నారెడ్డి మాల కొండయ్య, వాసా నారాయణ రెడ్డి, కొర్రకూటి వెంకటేశ్వర్లు, దుంపా అనిల్ కుమార్ రెడ్డి, గాలి శ్రీనివాసరావు, కంచర్ల ప్రసాద్, దగ్గుమాలి శంకరరెడ్డి, సోము సుబ్బారెడ్డి, పీఆర్ ఏఈఈ ఏ.కొండయ్య, డీఈ రవిబాబు, ఏఈ కోటా శ్రీహరి పాల్గొన్నారు.

శిశుగృహ బాలికను దత్తత తీసుకున్న అమెరికన్‌లు



దత్తత ధ్రువీకరణ పత్రం అందిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: తల్లిదండ్రులు లేని ఇద్దరు చిన్నారులను జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో సోమవారం అమెరికా, కర్ణాటకకు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఇద్దరికి దత్తత ధ్రువీకరణ పత్రాలతో పాటు చిన్నారులను దత్తత తీసుకున్న వారికి అప్పగించారు. విదేశీ దత్తత ప్రక్రియ ప్రకారం అమెరికా వాసులైన మైకేల్ లల్లి, అంబర్‌లల్లి ఒక పాపను దత్తత తీసుకోగా, కర్ణాటకకు చెందిన వీ అశోక్, కే సుమిత్రలు మరొక పాపను దత్తత తీసుకున్నారు. దీనిలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి, శిశుగృహ మేనేజర్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14న దర్శిలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

దర్శి(కురిచేడు): దర్శి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఈ నెల14వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పొదిలి రోడ్డులోని గౌతమి జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయ ప్రారంభోత్సవానికి దర్శి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కంభం: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం కంభంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు..స్థానిక భ్రమరాంబ స్కూలు సమీపంలో నివాసం ఉంటున్న షేక్ మహబూబ్ వలి (38) సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

స్పెషల్ పీపీగా వెంకట నరసింహారెడ్డి

ఒంగోలు: స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పూసపాటి వెంకట నరసింహారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈయన ఒంగోలుకు చెందిన న్యాయవాది. ఒకటో అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఏపీ ఎలక్ట్రిసిటీ చట్టం 2003కి సంబంధించిన కేసులను ప్రాసిక్యూషన్ తరఫున వాదిస్తారు. ఈయన మూడు సంవత్సరాలపాటు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇందుకుగానూ నెలకు రూ.40 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రకాశం జిల్లాతో అనుబంధాన్ని మరవలేను

- జిల్లా ప్రజలు ఎంతో మంచివారు
- పోలీసులు కూడా సేవాభావంతో పనిచేసేవారే
- ఎస్పీగా రెండు సంవత్సరాల ఏడు నెలలు పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా..
- ఉత్తమ పోలీసింగ్‌తో పాటు పోలీస్ సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించా
- వీడ్కోలు పరేడ్‌లో ఉద్విగ్నభరితంగా ప్రసంగించిన ఎస్పీ మలికాగర్గ్


బదిలీపై వెళ్తున్న ఎస్పీ మలికాగర్గ్‌ను సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

ఒంగోలు సబర్బన్:

ప్రకాశం జిల్లాతో పెనవేసుకున్న అనుబంధాన్ని ఎన్నటికీ మరవలేనని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి ఎస్పీగా బదిలీపై వెళ్తున్న ఆమెకు సోమవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పరేడ్ నిర్వహించారు. ఉదయం 6.45 గంటలకే జిల్లాలోని పోలీసులంతా పాల్గొని ఆత్మీయ వీడ్కోలు పలికారు. ముందుగా పరేడ్ కమాండర్ నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్లటూన్ల వారీగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వారి నుంచి ఆత్మీయ వీడ్కోలు స్వీకరించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన ఓపెన్ టాప్ వాహనానికి పోలీస్ అధికారులు తాళ్లు కట్టి పరేడ్ గ్రౌండ్ నుంచి క్యాంపు కార్యాలయం వరకు లాక్కొచ్చి మరీ ఎస్పీ మలికాగర్గ్‌ను గౌరవించారు. మహిళా పోలీసులు ఎస్పీని భుజాలపై ఎత్తుకుని పూల వర్షం కురిపించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ ఏఎస్పీ నుంచి మొదటిసారిగా పదోన్నతి పొంది జిల్లాలో ఎస్పీగా రెండు సంవత్సరాల 7 నెలల పాటు బాధ్యతలు నిర్వహించానన్నారు. ప్రకాశం జిల్లా ప్రజలు చాలా మంచివారని కితాబిచ్చారు. పోలీసులు, పోలీస్ అధికారులు సేవాభావంతో పనిచేసి అందించిన సహకారం అభినందనీయమన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెళ్తున్నప్పటికీ జిల్లాలో అందరూ అందించిన సేవలను మరువలేనని అన్నారు. శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, బందోబస్తు, తుఫాన్ సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా సిబ్బంది చేసిన కృషి పోలీసులు సేవాతత్వానికి అద్దం పట్టాయని కొనియాడారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేందుకు దోహదపడినట్లు తెలిపారు. ఎలక్షన్ విధులు, మిస్సింగ్ మొబైల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సిబ్బంది సంక్షేమం, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవార్డులతో పాటు వినూత్న కార్యక్రమాలు చేపట్టాలంటే అది ఏ ఒక్కరితోనే సాధ్యం అయ్యేది కాదన్నారు. మనందరం కలిసికట్టుగా చేస్తేనే సాధ్యమైందన్నారు. రెండున్నర సంవత్సరాల పాటు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా విధులు నిర్వర్తించానంటే.. డిపార్ట్‌మెంట్‌లోని ప్రతిఒక్కరూ పనిచేయడం వలనే సాధ్యమైందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. హోంగార్డు మొదలుకుని ఏఎస్పీ స్థాయి అధికారి వరకు అందరూ బాగా పనిచేశారని గుర్తు చేశారు. జిల్లా వదిలి వెళ్లినప్పటికీ ఎవరికి ఏ పని కావాలన్నా తనకు స్వయంగా ఫోన్ చేయవచ్చని, లేకుంటే నేరుగా వచ్చి సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలనేవి సర్వసాధారణమని, బాధగా ఉన్నా తప్పదని ఉద్వేగభరితంగా ఎస్పీ మలికాగర్గ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కే నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్స్) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్పీ మలికాగర్గ్ వాహనాన్ని తాళ్లతో లాగుతూ గౌరవిస్తున్న పోలీస్ అధికారులు


వల్లూరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

వల్లూరమ్మ సేవలో చెవిరెడ్డి

టంగుటూరు: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్, ఉమ్మడి నెల్లూరు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం వల్లూరమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు, గోత్ర నామార్చనలు నిర్వహించి, అమ్మవారి శేష వస్త్రంతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు మీద అర్చనలు చేయించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, ఉప ప్రధాన అర్చకులు ఉమా శంకర్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష

ఒంగోలు: హత్యకేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఒంగోలులోని 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కందుకూరు మండలం కోవూరుకు చెందిన ఒక మహిళ భర్తతో విభేదాల కారణంగా గ్రామంలోనే పుట్టింటి వద్ద ఉంటుంది. ఆమెపై కామవాంఛతో గొడపేరు రాజేష్ అనే వ్యక్తి వేధించడం ప్రారంభించాడు. 2021 ఫిబ్రవరి 22న ఆమె ఇంట్లో ఉండగా, రాజేష్ వెళ్లి భౌతికంగా దాడి చేశాడు. ఆమె తల్లి, తండ్రి అడ్డుకోగా, పక్కనే ఉన్న రోకలిబండతో ఆమె తండ్రి పాలేటి చిన్న యేసు తలపై బలంగా కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యేసు మరణించాడు. ఈ ఘటనపై యేసు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు వేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.1000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష విధించారు. అంతేగాకుండా ఫిర్యాదిని గాయపరిచినందుకు 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చావలి రమేష్‌బాబు వాదించగా, లైజన్ ఆఫీసర్‌గా బి.సత్యశ్రీనివాస్, కందుకూరు ఏఎస్సై మన్నం వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ జి.కిషోర్ సహకరించారు.

రేపు టీచ్ టూల్ అబ్జర్వర్లకు శిక్షణ

ఒంగోలు: టీచ్ టూల్ అబ్జర్వర్లకు జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఈ నెల 13వ తేదీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల, మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కనిగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శిక్షణ నిమిత్తం 413 మంది అబ్జర్వర్లను జిల్లాలోని మూడు శిక్షణ కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. 9 రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ విధానంలో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ట్రైనింగ్‌కు కేటాయించిన అధికారులను సంబంధిత అధికారులు రిలీవ్ చేయాలని, కార్యక్రమాన్ని ఉప విద్యాశాఖ అధికారులు, సంబంధిత కోర్సు డైరెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు.

గిద్దలూరు గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంబాబు, పక్కన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



ఎమ్మెల్యేలు రాంబాబు, నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుములను సన్మానిస్తున్న నాయకులు

- ప్రజాసేవకే నా జీవితం అంకితం
- నాగార్జునరెడ్డిని మంచి మెజారిటీతో గెలిపించండి
- పరిచయ వేదికలో ఎమ్మెల్యే రాంబాబు విజ్ఞప్తి

మార్కాపురం: గిద్దలూరు గడ్డ..వైఎస్సార్ సీపీకి అడ్డా.. అని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గిద్దలూరు నుంచి పోటీ చేస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు గిద్దలూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులను ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణ శివార్లలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని గిద్దలూరు, అర్థవీడు, కంభం, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మండలాల ప్రజా ప్రతినిధులకు, జేసీఎస్ కన్వీనర్లకు, ముఖ్య నాయకులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ 2009లో తన రాజకీయ ప్రస్థానాన్ని గిద్దలూరు నుంచి ప్రారంభించానని, ప్రజలు తనపై విశేష ఆదరణ, అభిమానం చూపి గెలిపించారన్నారు. 2019 లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తాను పోటీచేసినప్పుడు పులివెందుల తరువాత అంతటి మెజారిటీని గిద్దలూరు ప్రజలు తనకు ఇచ్చి అసెంబ్లీకి పంపారని రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ అదే మెజారిటీతో నాగార్జునరెడ్డిని గిద్దలూరు నుంచి గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నియోజకవర్గంలో అర్హులందరికీ అమలయ్యేలా తాను కృషి చేశానన్నారు. జగనన్న సంక్షేమ పథకాలకు అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి కేపీ కొండారెడ్డి 1972 నుంచి రాజకీయాల్లో ఉండి మూడుసార్లు సమితి ప్రెసిడెంట్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశారన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో మొత్తం 282 బూత్‌లు, ప్రతి బూత్‌లో కార్యకర్తలు కష్టపడి అనునిత్యం ప్రజలతో మమేకమవ్వాలని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను సోషల్‌మీడియాలో తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తిచేశారని అన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమానికి మన ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడికి ఫలితం ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తను గౌరవించడం నా బాధ్యత అన్నారు. ఈనెల 16 నుంచి గిద్దలూరులో ప్రజలకు అందుబాటులో ఉంటానని, అనునిత్యం ప్రజాసేవకు ముందుంటానని చెప్పారు. తన మామ ఉడుముల శ్రీనివాసులరెడ్డి గతంలో కంభం ఎమ్మెల్యేగా ఉండి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, కంభం, అర్థవీడు, బేస్తవారిపేట, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, మండల కన్వీనర్లైన బీ వెంకటరాజు, కే జ్యోతి, నెమలిదిన్నె చెన్నారెడ్డి, కే నరసింహులు, వై వెంకటేశ్వరరావు, ఎస్ వెంకటనాయుడు, పీ శ్రీదేవి, షేక్ రసూల్, పీవీ సుబ్బయ్య, కే దీపిక, సీహెచ్ పోతిరెడ్డి, జీ చెన్నారెడ్డి, కె రఘునాథరెడ్డి, మురళి, జనార్దన్‌రెడ్డి, రషీద్, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, షేక్ మున్నా, బీ నాగిరెడ్డి, మోహన్‌రెడ్డి, పీ ఓబులరావు, ఈశ్వరనాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్ కౌసల్య, నీలోఫర్‌తోపాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామపార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డిని ఘనంగా సన్మానించారు.

సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాబోయే సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలు నుంచి మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే ఎన్నికల నిర్వహణతో పాటు హౌసింగ్, ఇంటి స్థలాలు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌భారత్, డెయిరీ యూనిట్ల గ్రౌండింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు, తర్వాత చేపట్టాల్సిన విధులు, ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు ఎన్నికల సంఘం నిబంధనలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ అప్పగించిన ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అందుకు అవసరమైన సామగ్రి, పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలని ఆదేశించారు. జనవరి 22వ తేదీ ప్రకటించిన ఓటర్ల జాబితా సరిగా ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. ఆర్‌ఓ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని నాలుగు రోజుల్లో డ్రైవ్‌మోడ్‌లో క్లియర్ చేయాలన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ శ్రీలత, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వసుంధర, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సహకార ఉత్సవ్ 2.0లో రెండోస్థానం

ఒంగోలు టౌన్: సహకార ఉత్సవ్ 2.0 – 2024లో భాగంగా విజయవాడలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. మూడంచెల విధానంలోని విభాగాల మధ్య సహకార స్ఫూర్తిని కలిగించే ఉద్దేశంతో ఆప్కాబ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, కో ఆపరేటివ్ శాఖ, ప్రాథమిక పరపతి సంఘాలను 4 జోన్లుగా విభజించి పోటీలు నిర్వహించారు. క్యారమ్స్, బ్యాడ్మింటన్, చెస్, క్రికెట్ పోటీలను నిర్వహించగా క్రికెట్ పోటీలలో ప్రకాశం జిల్లా సహకారం బ్యాంకు అద్భుతమైన ప్రదర్శనతో అలరించింది. ఈ సందర్భంగా సోమవారం అభినందన సభ నిర్వహించారు. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఉద్యోగ నిర్వహణతో పాటుగా క్రీడల్లో కూడా ఉత్తమ ప్రతిభను కనబరచిన ఉద్యోగులను అభినందిస్తున్నానని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ప్రకాశం జిల్లా సహకార బ్యాంకు ప్రతిష్ట తీసుకువచ్చిన ఉద్యోగులు భవిష్యత్‌లో మరింత బాగా రాణించి ప్రథమస్థానంలో నిలవాలని సీఈఓ కోటిరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉద్యోగులు అభినందించిన బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, సీఈఓ కోటిరెడ్డి

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

రాచర్ల: విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని అక్కపల్లె గ్రామ సమీపంలో గల పొలాల్లో సోమవారం చోటుచేసుకుంది. కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన వేగమ్మ (60) రాచర్ల మండలం అక్కపల్లె గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి పొలంలో మొక్కజొన్న కోత పనికి వచ్చింది. మొక్కజొన్న పొలానికి చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసి ఉంది. పొలంలోకి పనికి వెళ్లే సమయంలో సోలార్ కరెంట్‌ను ఆపేసి వెళ్లారు. పొలంలో పనులు చేస్తున్న సమయంలో బోరుబావి వద్ద ఉన్న త్రీఫేజ్ లైను తీగ ఒకటి తెగి సోలార్ కంచెపై పడటంతో సోలార్ కంచెకు విద్యుత్ సరఫరా జరిగి మొక్కజొన్న కండెలు కోస్తున్న వేగమ్మ కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కృష్ణపావని తెలిపారు.

రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ నెల 13వ తేదీ వారి పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. సమావేశాలకు సంబంధించిన షెడ్యూలు, చర్చించాల్సిన అంశాలపై నోట్సును ఇప్పటికే పంపామన్నారు. ఆయా అంశాలకు సంబంధించి ఒక రిసోర్సు పర్సన్‌ను ఎంపిక చేసుకోవాలని, తద్వారా టీచ్‌టూల్, ఇంగ్లిష్ పెడగాగి, మిస్ కాన్సెప్ట్ పోస్టర్స్ వంటి అంశాలపై చర్చించాలని సూచించారు. ఉప విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు సమావేశాలను పర్యవేక్షించాలని సూచించారు.